జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 28 | జూన్ | 2026 ◆ పేజీలు : 6

## అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ
- ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులను పరిశీలించి అధికారులకు, బూత్ స్థాయి ప్రతినిధులకు సూచనలు
- శాంతినగర్, ఎర్రగుంటలో పాఠశాలల నిర్మాణ పనుల తనిఖీ



2 లో...



# సీతమ్మ సాగర్‌ను... సాగనంపడమేనా...?

5 లో..

- పూడికతీతనా...! ఇసుక తవ్వకమా..?
- పర్యావరణ, గనుల శాఖ అనుమతి ఉందా..!
- బినామీ కట్టడిదారులు ఆదివాసీలను ఎలా మోసం చేస్తున్నారు
- ప్రాజెక్టు పేరుతో ప్రకృతిని ప్రజలను దోచుకుంటున్న వైనం

గోదావరి తల్లి ఒడిలో వెలసిన సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టు ఆదివాసీల ఆశల దీపం. దుమ్ముగూడెం మండలంలోని గోదావరి నీటిని ఒడిసిపట్టి, భద్రాద్రి జిల్లాలోని లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామని ప్రభుత్వం మాట ఇచ్చింది. కానీ నేడు ఆ మాట నీటిమూటగా మారింది. సాగునీరు రాలేదు, తాగునీరు అందలేదు. వచ్చింది మాత్రం ఇసుక లారీలే. "పూడిక తీస్తాం" అనే పేరుతో మొదలైన పని, "ఇసుక అమ్ముకుంటాం" అనే దోపిడీగా మారింది. పర్యావరణ అనుమతి లేదు. గనుల శాఖ అనుమతి లేదు. ఉన్నదల్లా బినామీ కట్టడిదారుల అనుమతి. అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు పొందిన ఆదివాసీ రైతుల భూములను, "ప్రాజెక్టు కోసం" అని చెప్పి లాక్కుని, అందులో ఇసుక తవ్వి కోట్లు గడిస్తున్నారు. సీతమ్మ సాగర్ నిర్మాణం కోసం కాదు, సీతమ్మ ఇసుక తరలింపు కోసమే ఈ తతంగం అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ప్రాజెక్టు ముసుగులో గోదావరి గర్భాన్ని తోడేస్తున్నారు. ఆదివాసీల బతుకులను బుగ్గిపాలు చేస్తున్నారు. అసలు సీతమ్మ సాగర్ లో ఏం జరుగుతోంది? పూడిక తీతా లేక ఇసుక దోపిడీనా? చట్టాలు ఎందుకు పని చేయడం లేదు? ఆదివాసీలు ఎలా మోసపోతున్నారు?

● మణుగూరు, ప్రజాజ్యోతి

## నేడు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 27,(ప్రజాజ్యోతి)** నేడు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ వైద్యులను ఆదేశించారు, శనివారం కార్యాలయంలో వైద్యాధికారులు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 28 నుండి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాలో

మిగతా 2 లో...

## వరదలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రాణ ,ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వరదల సన్నద్ధతతో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 27,(ప్రజాజ్యోతి)** గోదావరి నదిలో వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి గోదావరి

మిగతా 2 లో...

# వరదలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

వరదల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ వరదల సన్నద్ధతలో భాగంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుఏర్పాటు చేయడంతో పాటు ఈ ఏడాది నుంచి మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో మండల ఎమర్జెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో వరదల సమయంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను గుర్తించి, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ఇరిగేషన్, ఎస్ డీఆర్ ఎఫ్, ఎన్ డీ ఆర్ ఎఫ్ తదితర శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసి, క్విక్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, రెవెన్యూ, ఎస్ డీఆర్ ఎఫ్, ఎన్ డీఆర్ ఎఫ్ తదితర శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోవో ప్రభావంతో వర్షాభావ పరి



స్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని, వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో గోదావరి నీరు చేరకుండా, వర్షపు నీరు వేగంగా నదిలోకి వెళ్లేలా పంపింగ్ మోటార్లను సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలని అన్నారు.గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని, ఎరువులు, ముఖ్యంగా యూరియా వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా జాతీయ రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు.జిల్లాలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు, పుష్కరాల ఏర్పాట్లు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి భద్రాచలం–కూనవరం రహదారిపై చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. మూడు సంవత్సరాలుగా పనులు పూర్తికాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సారపాక జాతీయ రహదారిపై ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో గోదావరి వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఎత్తును పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదలకు ముందు, వరదల సమయంలో, అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సన్నద్ధతతో ఉండాలని, వర్షపాతం, వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి వరదల సమయంలో బూర్గంపాడు, అశ్వాపురం ప్రాంతాలు అధికంగా ప్రభావితమవుతాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల సన్నద్ధతలో పరిశ్రమల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణు గోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు,వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, అటవీ, అగ్నిమాపక, ఎస్ డీ ఆర్ ఎఫ్,ఎన్ డీఆర్ ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 27 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి, అబ్బుగూడెం గ్రామపంచాయతీల పరిధిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్న బీఎల్ వోల పనితీరును పరిశీలించి, కాంగ్రెస్ పార్టీ తరపున నియమితులైన బూత్ స్థాయి ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటు హక్కు ఉన్న వారి పేర్లు ఎలాంటి కారణాలతోనూ జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్ వోలు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం శాంతినగర్, ఎర్రగుంట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పాఠశాలల ప్రహరీ గోడలు, వృత్తి విద్యా భవనాలు, భవిత భవనాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్, సీనియర్ నాయకులు వనమా గాంధీ, భానోత్ భీముడు, వేముల రమణ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల నరేష్, ఎమ్మార్వో స్వర్ణ, ఎంపీడీఓ డి. రాజేశ్వరి, పీసీసీ జిల్లా సభ్యుడు వీరబోయిన నాగేశ్వరరావు, దుబ్బాకుల రాము, మరకాల లక్ష్మారెడ్డి, ఎన్ ఎస్ యూఐ మండల అధ్యక్షుడు బాజీబాబా, బాలసాని శ్రీను, కోండ్రు రత్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

0–5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 98 818 మంది 0–5 సంవత్సరంలోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇవ్వడం జరుగుతుందన్నారు, మొత్తం925 బూత్ లు ,38 ట్రాన్సిట్ పాయింట్లు , 1001టీములు ఏర్పాటు చేయడం జరిగింది పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడం, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయడంలో ప్రతి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా పల్స్ పోలియో కి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు ,ఈ కార్యక్రమంలో వైద్యులు రాకేష్, ప్రతాప్, ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సిహెచ్ఓ నాగభూషణం ,హెచ్ ఇ వో రాంప్రసాద్, రామారావు, హరికృష్ణ , ప్రియా నర్సింగ్ ఆఫీసర్, పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకునేందుకు సరైన పత్రాలు సమర్పించాలి: కొప్పుల రాంబాబు



**ములకలపల్లి, జూన్ 27 (ప్రజాజ్యోతి ):** మండలంలోని జగన్నాథపురం పంచాయతీ బూత్ నంబర్–20 పరిధిలోని నర్సాపురం, చింతపేట, నల్లివారిగూడెం, తొగూడెం గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కొప్పుల రాంబాబు పాల్గొని, ప్రతి ఓటరు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైన పత్రాలు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తీసుకువచ్చి అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. భారత ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, బీఎల్ఓ సంధ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరం రామకృష్ణ, సున్నం నగేష్, పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు

## జగన్నాథపురంలో ఘనంగా వన మహోత్సవం

- ప్రతి ఇంటా మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలి: సర్పంచ్ కుంజా వినోద్




**ములకలపల్లి,జూన్ 27 (ప్రజాజ్యోతి):** మండలం జగన్నాధపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొని మొక్కలు గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరిత కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. గ్రామ పంచాయతీలో ఉచితంగా అందుబాటులో ఉన్న పూలు, పండ్ల మొక్కలను ప్రజలు తీసుకెళ్లి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీష్, ములకలపల్లి మండల బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్, బీఎల్ఏలు షేక్ జబ్బార్, రామాచారి, సున్నం నాగేష్, కూరం రామకృష్ణ, గ్రామస్తులు షేక్ జాఫర్, పలకపాటి శ్రీను, పంచాయతీ మల్టిపర్పస్ వర్కర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో విజయవంతానికి మండల వ్యాప్తంగా సన్నాహాలు

- పాఠశాలల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ
- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ మనోజ్ పిలుపు



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 28 (ప్రజా జ్యోతి):** పల్స్ పోలియో జాతీయ రోగనిరోధక కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. "పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం", "ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ మండ లంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ ఈ విడతలో మరోసారి వేయించడం వల్లే పిల్లలకు సంపూర్ణ రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. మండలంలో ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఉండేందుకు 24 పోలియో బూత్‌లు, ఒక మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.జూన్ 28న మండలంలోని అన్ని పోలియో బూత్‌లలో ఉదయం నుంచే ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జూన్ 29, 30 తేదీల్లో బూత్‌లకు రాలేకపోయిన చిన్నారుల కోసం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు.తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, అప్పటి నుంచి కొనసాగుతున్న పోలియో రహిత తెలంగాణ, భారతదేశ హోదాను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని డాక్టర్ మనోజ్ కోరారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అవగాహన ర్యాలీ, సన్నాహక కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆనంద్ కుమార్, ప్రజారోగ్య నర్సు ఎస్తేర్ రాణి, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాష్ రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు నమ్మొద్దు.. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలి

- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు పక్కా రశీదు తప్పనిసరి ఏవో ఎన్.ఎమ్.సి. చటర్జీ 'సీడ్ విలేజ్' ద్వారా గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాల సరఫరా
- నకిలీలు అమ్ముకుంటే కఠిన చర్యలు.. పోలీసులతో కలిసి ప్రత్యేక నిఘా



**అశ్వాపురం, జూన్ 27, ప్రజా జ్యోతి** వానాకాలం సాగు పనులు ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు లేని, నాణ్యత లేని విత్తనాలను కొని మోసపోవద్దని అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి ఎన్.ఎమ్.సి. చటర్జీ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతలు తమ పొలాల్లో సాగు చేపట్టేటప్పుడు కేవలం వ్యవసాయ శాఖ ఆమోదం పొందిన ధృవీకృత, నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను మాత్రమే వాడాలని కోరారు.

### ››› పక్కా బిల్లు ఉంటేనే రక్షణ..

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో పాటించాల్సిన పలు ముఖ్యమైన జాగ్రత్తలను ఏవో చటర్జీ ఈ సందర్భంగా వివరించారు. రైతులు తాము సాగు చేసే భూమి రకం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనువైన విత్తన రకాలను మాత్రమే ఎంచుకోవాలి. విత్తన ప్యాకెట్లపై ఉన్న బ్యాచ్ నంబరు, గడువు తేదీ వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. విత్తనాలు కొనే ప్రతిసారీ డీలర్ల నుండి పక్కా తూకం వివరాలతో కూడిన రశీదును ఖచ్చితంగా అడిగి తీసుకోవాలి. భవిష్యత్తులో విత్తనం మొలకెత్తకపోయినా, నకిలీదని తేలినా చట్టపరమైన చర్యలకు ఈ బిల్లే ప్రధాన ఆధారం.

### ››› తక్కువ ధర ఆశ చూపిస్తే మోసపోవద్దు!

మార్కెట్లో లైసెన్స్ లేని కొందరు ప్రైవేటు వ్యాపారస్థులు తక్కువ ధరకు వస్తున్నాయని ఆశ చూపిస్తూ నకిలీ విత్తనాలను విక్రయించే ప్రమాదం ఉందని, అటువంటి వారి వద్ద అస్సలు విత్తనాలు కొనవద్దని చటర్జీ హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సీడ్ విలేజ్' ప్రోగ్రామ్ ద్వారా గ్రామాల్లోనే రైతులకు సరసమైన ధరలకే పక్కా నాణ్యత గల విత్తనాలను సరఫరా చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ››› నకిలీల అమ్మకంపై ఉక్కుపాదం..

మండలంలో నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తూ అమాయక రైతులను ముంచాలని చూసే అక్రమార్కులపై వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులు సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా మండలంలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మృతికి ఎమ్మెల్యే సంతాపం



**ఇల్లందు, జూన్, 27 (ప్రజా జ్యోతి)** 1972–78 లో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే వంగా సుబ్బారావు మృతికి శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలానికి చెందిన వంగా సుబ్బారావు 1972–78లో అఖిలభారత జాతీయ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారన్నారు. ఇల్లందు నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు, కాంగ్రెస్ పార్టీకి చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని కొనియాడారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ బలోపేతమే నా ధ్యేయం

- సొంత ఖర్చులతో పార్టీ కోసం పనిచేస్తా -కుప్పాల సౌజన్య



**చర్ల, జూన్ 27(ప్రజా జ్యోతి ):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంపై ఉన్న విశ్వాసంతో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని బిఆర్ఎస్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు కుప్పాల సౌజన్య తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైతే సొంత ఖర్చులతోనైనా ప్రచారం నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి చర్యలు తెలంగా ణ ప్రజలకు విశేష ప్రయోజనం చేకూర్చాయని ఆమె అన్నారు. రైతులు, మహిళ లు, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన కార్యక్రమాలు రా ష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం పార్టీని గ్రామస్థా యిలో మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని సౌజన్య తెలిపారు. గ్రామ గ్రామాన పర్యటిస్తూ కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని వెల్లడించారు.రానున్న 2029 ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ చూపిన మార్గంలో నడుస్తూ పార్టీ విజయానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యం తో పనిచేస్తే బిఆర్ఎస్‌కు మళ్లీ ప్రజాదరణ పెరుగుతుందని, తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని ఆదరిస్తారనే విశ్వాసాన్ని కుప్పాల సౌజన్య వ్యక్తం చేశారు.

## మొబైల్ యాప్ తో సంబంధం లేకుండా యూరియా ఇవ్వాలి

- ఏఐకేఎంఎస్




**గుండాల 27 ప్రజా జ్యోతి** మొబైల్ యాప్ తో సంబంధం లేకుండా యూరియా ఇతర ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని రాష్ట్ర నాయకులు ఎం కోటేశ్వరరావు, అన్నారు శనివారం గుండాల మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐకి అందజేశారు ఈ ధర్నానుదేశించి ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎం కోటేశ్వరరావు, జిల్లా నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీలో నేటికీ సెల్ఫోన్ లేని అనేక కుటుంబాలు ఉన్నాయని, అక్కడక్కడ నేటికీ సరైన సెల్ సిగ్నల్ లేని గ్రామాలు ఉన్నప్పటికీ యాప్ల ద్వారా యూరియా ఏ విధంగా నమోదు చేసుకుంటారు తెలపాలన్నారు. ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటాం సంక్షేమ పథకాలు ఇస్తాం అంటూ మాటలకే పరిమితమయ్యాయని ఆచరణలో విఫలం అయ్యారన్నారు. గత సంవత్సరం యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రస్తుతం యాప్ల ద్వారా యూరియా బుక్ చేసుకోవాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు యాపుల ద్వారా యూరియా సరఫరాను వెంటనే రద్దుచేసి సబ్సిడీ ద్వారా రైతులకు విరివిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ముక్తి సత్యం, కోరం సీతారాములు,బచ్చలి సారయ్య, గడ్డం లాలయ్య, ఈసం మంగయ్య, కల్తీ మల్లయ్య, పాయం ఎల్లన్న, పిండి కట్ల పెంటన్న ముఖ్య వెంకన్న, తప్పెట్ల రాంబాబు, యాసారపు వెంకన్న, వర్శక రవి తాటి రమేష్, ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మా వార్డు సమస్యల పరిస్థితి ఏంటి..?

- 23వ వార్డు కౌన్సిలర్ రాజీనామా చేయాలని ప్రజల డిమాండ్

**ఇల్లందు, జూన్ 27 (ప్రజా జ్యోతి )** మున్సిపల్ ఎన్నికలు జరిగిన నాటి నుండి నేటి వరకు తమ వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత ఇప్పటివరకు వార్డుకు రాలేదని ఇక్కడి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కుప్పలు తెప్పలుగా సమస్యలు పేరుకుపోతున్నాయని శనివారం ప్రజలు వార్డు అధికారి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వార్డు కౌన్సిలర్ లేకపోవడం వల్ల వారానికి ఒక వ్యక్తి వచ్చి తమ వార్డుకు ఇంచార్జ్ లమని చెబుతూ సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలంటూ మాట్లాడుతున్నారని, అసలు ఇంచార్జ్ వ్యవస్థను ఎవరు ఏర్పాటు చేశారని అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కేవలం పదవుల కోసం ఎన్నికల్లో నిలబడి ఆ పదవి రాకపోవడంతో ముఖం చాటేసిన వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత తక్షణమే రాజీనామా చేయాలంటూ వార్డు ప్రజలు ఉరుసు రామకృష్ణ, జూపాక సుమంత్, మోహన్ రెడ్డి, కిరణ్ తాళ్లపల్లి సదానందం, కటకం రాజారాం, మాజీ వార్డు కౌన్సిలర్ కుమార్ రవీందర్ డిమాండ్ చేశారు. ఇప్పటికే రెండు సార్లు వార్డు సభలు జరిగాయని, ఈ సభలను కౌన్సిలర్ రాకపోవడంతో బహిష్కరించడం జరిగిందని భవిష్యత్తులో వార్డు పరిధిలో ఎలాంటి సభలు నిర్వహించిన కౌన్సిలర్ హాజరు కాకపోతే ప్రజలు తిరుగుబాటు చేసి బహిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇలాంటి పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకొని వార్డు కౌన్సిలర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన వార్డు అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌన్సిలర్ అందుబాటులో లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినట్లు తెలిపారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, మంచినీరు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువేస్తున్నానని వార్డు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.



## వైభవంగా శ్రీ బాలాజీ స్వామివారి కల్యాణ మహోత్సవం

- పలగాని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 27 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన సన్నిధిలో ప్రతి శనివారం నిర్వహించే శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవం ఈ శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో అన్నపురెడ్డిపల్లికి చెందిన పలగాని చెన్నారావు–రమణ దంపతులు, నరసింహారావు–కుమారి దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.తమ తండ్రి పలగాని నాగభూషణం, తమ అక్క పలగాని వెంకటరమణ జ్ఞాపకార్థం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాదాన్ని భుజించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగగా, కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం

- మండల వైద్యాధికారి సాయి కళ్యాణ్



**ములకలపల్లి, జూన్ 27 (ప్రజాజ్యోతి):** మండలంలో జూన్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ తెలిపారు. ఆదివారం (జూన్ 28) మండలంలోని ఏర్పాటు చేసిన 35 పల్స్ పోలియో బూత్‌లలో ఐదు సంవత్సరాల లోపు (0–5 సంవత్సరాలు) పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది గ్రామాల వారీగా ఇంటింటికి వెళ్లి తొలి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులను గుర్తించి వారికి పోలియో డ్రాప్స్ వేయనున్నారు. మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో మొత్తం 35 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా, 2,395 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ కార్యక్రమం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, మండలంలోని తల్లిదండ్రులు తమ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

- 0–5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి
- నేడు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం
- నేడు నిర్దేశించిన బూతుల వద్ద వేయనున్న పల్స్ పోలియో చుక్కలు
- 29, 30 తేదీలలో నేరుగా ఇంటి వద్దకే పల్స్ పోలియో చుక్కలు
- ప్రతి చిన్నారికి టీకా అందించడమే లక్ష్యం
- చిన్నారులకు పోలియో చుక్కలు ఎంతో శ్రేయస్కరం



**ఇల్లందు, జూన్ 28 (ప్రజా జ్యోతి )** దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఘనంగా జరగనుంది. జననం నుంచి ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో మందు వేయడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా సమీప పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని వైద్య, శాఖ అధికారులు కోరుతున్నారు.

### ››› నేడు ప్రత్యేక బూత్‌లలో పల్స్ పోలియో

మండల, మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి ఉదయం నుంచే టీకా కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్ లు, రైల్వే స్టేషన్లు ఇతరత్రా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. గతంలో పోలియో చుక్కలు వేసుకున్న పిల్లలకు కూడా ఈసారి తప్పనిసరిగా వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

### ››› ఇంటింటికీ వెళ్లి టీకా

ఈనెల 28న పోలియో చుక్కల బూత్‌లకు రాలేని చిన్నారుల కోసం జూన్ 29, 30 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారు. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ప్రత్యేక ప్రణాళికతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వలస కుటుంబాలు, మారుమూల ప్రాంతాల్లోని చిన్నారులపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

### ››› పోలియోపై నిర్లక్ష్యం వద్దు

పోలియో ఒక ప్రమాదకర వైరల్ వ్యాధి. ఇది పిల్లల్లో శాశ్వత అంగవైకల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. అయితే రెండు చుక్కల పోలియో మందుతో ఈ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నా, అనారోగ్యంతో ఉన్నా పోలి యో చుక్కలు వేయించవచ్చని తెలిపారు.

### ››› ప్రజల సహకారంతోనే వలస పోలియో విజయవంతం

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. అపోహలను నమ్మకుండా ప్రతి తల్లిదండ్రులు తమ చిన్నారులకు రెండు చుక్కలు వేయించడం ద్వారా పోలియో నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు. ప్రజల సహకారంతోనే దేశాన్ని శాశ్వతంగా పోలియో రహితంగా నిలబెట్టడం సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## గిరిజన హక్కులను హరించే విధానాలు విరమించుకోవాలి

- రామావత్ అంజయ్య నాయక్
- పోడుభూములకు హకుపత్రాలు అందజేయాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా
- గిరిజన హక్కులకు రక్షణ కల్పించాలి. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్









**ములకలపల్లి, జూన్ 27, (ప్రజాజ్యోతి):** గిరిజన హక్కులను హరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ వనరులను బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ములకలపల్లి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జిల్లా తెలంగాణ గిరిజన సమాఖ్య విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు సొందే కుటుంబరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా అంజయ్య నాయక్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ఆదివాసీల జీవనాధారాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. "ఆపరేషన్ కగార్" పేరుతో ఆదివాసీల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా మాట్లాడుతూ, పోడు సాగుదారులకు భూ పట్టాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. పోడు భూముల్లో సాగుకు అటవీశాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ, పోడు భూములను సాగు చేస్తున్న ఆదివాసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతులైన గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గిరిజన హక్కులకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు విద్య, వైద్యం, రహదారులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా గిరిజన సమాఖ్య కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, గుగులోత్ రామచందర్, భూక్యా దశ్రు, వీసెంశెట్టి పూర్ణచందర్ రావు, ఎం.డి. యూసుఫ్, నరాటి రమేష్, కోర్రి భద్రం, పువ్వాల లలితారావు, ఎస్కే జబ్బార్, పూనెం రాంచంద్రం, వెంకట్, వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సీతమ్మ సాగర్‌ను... సాగనంపడమేనా...?

- పూడికతీతనా...! ఇసుక తవ్వకమా..?
- పర్యావరణ, గనుల శాఖ అనుమతి ఉందా..!
- బినామీ కట్టడి దారులు ఆదివా సీలను ఎలా మోసం చేస్తున్నారు
- ప్రాజెక్టు పేరుతో ప్రకృతిని ప్రజలను దోచుకుంటున్న వైనం

**గోదావరి తల్లి ఒడిలో వెలసిన సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఆదివాసీల ఆశల దీపం. దుమ్ముగూడెం మండలంలోని గోదావరి నీటిని ఒడిసిపట్టి, భద్రాద్రి జిల్లాలోని లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామని ప్రభుత్వం మాట ఇచ్చింది. కానీ నేడు ఆ మాట నీటిమూటగా మారింది. సాగునీరు రాలేదు, తాగునీరు అందలేదు. వచ్చింది మాత్రం ఇసుక లారీలే. "పూడిక తీస్తాం" అనే పేరుతో మొదలైన పని, "ఇసుక అమ్ముకుంటాం" అనే దోపిడీగా మారింది. పర్యావరణ అనుమతి లేదు. గనుల శాఖ అనుమతి లేదు. ఉన్నదల్లా బినామీ కట్టడిదారుల అనుమతి. అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు పొందిన ఆదివాసీ రైతుల భూములను, "ప్రాజెక్టు కోసం" అని చెప్పి లాక్కుని, అందులో ఇసుక తవ్వి కోట్లు గడిస్తున్నారు. సీతమ్మ సాగర్ నిర్మాణం కోసం కాదు, సీతమ్మ ఇసుక తరలింపు కోసమే ఈ తతంగం అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ప్రాజెక్టు ముసుగులో గోదావరి గర్భాన్ని తోడేస్తున్నారు. ఆదివాసీల బతుకులను బుగ్గిపాలు చేస్తున్నారు. అసలు సీతమ్మ సాగర్ లో ఏం జరుగుతోంది? పూడిక తీతా లేక ఇసుక దోపిడీనా? చట్టాలు ఎందుకు పని చేయడం లేదు? ఆదివాసీలు ఎలా మోసపోతున్నారు?**

● మణుగూరు, ప్రజాజ్యోతి

గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతమ్మసాగర్ బహుళార్ధక సాధక ప్రాజెక్టు ఇప్పుడు వివాదాల వలయంలో చిక్కుకుంది. "పూడికతీత" పేరుతో మొదలైన పనులు "ఇసుక తవ్వకం"గా మారాయని, దీని వెనుక బినామీ కాంట్రాక్టర్ల పెద్ద దోపిడీ దాగి ఉందని స్థానికులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా నిబంధనలకు నీళ్లొదిలి సాగుతున్న ఈ తవ్వకాల తీరుతెన్నులు. గోదావరి నదిలో శాస్త్రీయ అధ్యయనం లేకుండా ఇసుక తవ్వకాలు జరపకూడదు. నది గర్భాన్ని, జలచరాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. సీతమ్మ సాగర్ నీళ్ల కోసం, ఇసుక కోసం కాదు. ఈ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వక పోగా ఉన్న ఇసుకను, ఆదివాసీల బతుకులను దోచుకోవడం క్షమించరాని నేరం. ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టేది ఎవరో వేచి చూడాల్సిందే.

### ››› పూడికతీతనా... ఇసుక తవ్వకమా..?

ప్రభుత్వం చెప్పేది సీతమ్మ సాగర్ జలాశయంలో 0.5 టీఎంసీల మేర పూడిక పేరుకుపోయింది. దాన్ని తొలగిస్తే నీటి నిల్వ సామర్ధ్యం పెరుగుతుంది. అందుకే 'పూడిక తీత' పనులు చేస్తున్నాం. తీసిన మట్టి, ఇసుకను అమ్ముకుని ప్రాజెక్టు ఖర్చుకు వాడుకుంటాం. క్షేత్రస్థాయిలో పూడిక తీయాల్సింది జలాశయం మధ్యలో, లోతైన ప్రాంతంలో కానీ తవ్వకాలు జరుగుతున్నది నడి గోదావరి ఒడ్డున, ఇసుక దిబ్బలు ఉన్నచోట. బురద కాదు, బంగారం లాంటి నాణ్యమైన ఇసుకను తీస్తున్నారు. పూడికతీతకు చిన్న యంత్రాలు చాలు. కానీ ఇక్కడ 50కి పైగా పెద్ద ప్రోక్లైన్లు, జేసీబీలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. రోజుకు 500 లారీల ఇసుక తరలిపోతోంది. పగలు అధికారుల కళ్లు కప్పడానికి నామమాత్రంగా పూడిక తీస్తారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 4 వరకు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతాయి. ఒక లారీకి 10 టన్నుల ఇసుక అనుమతి ఉంటే, 25 టన్నులు నింపి తరలిస్తున్నారు. రోజుకు 500 లారీల లెక్కన ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం బినామీల జేబుల్లోకి వెళ్తోంది. ఇది పూడిక తీత ముసుగులో జరుగుతున్న బహిరంగ ఇసుక దోపిడీ. ప్రాజెక్టు కోసం కాదు, ప్రైవేటు లాభం కోసం గోదావరి తల్లి కడుపు కోస్తున్నారు.

### ››› పర్యావరణ, గనుల శాఖ అనుమతి ఉందా..!

అనుమతుల అడ్రసే లేదు నిబంధనలకు తూట్లు పొడుస్తున్న బినామి కాంట్రాక్టర్లు. జాతీయ హరిత న్యాయస్థానం నిబంధనల ప్రకారం యంత్రాలతో ఒక్క తట్టెడు మట్టి తీయాలన్నా అనుమతులు తప్పనిసరి. కానీ ఇక్కడ ఆ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు పూర్తిస్థాయి పర్యావరణ అనుమతి రాలేదు. 2023 లోనే అనుమతి లేకుండా 632 రోజులు అక్రమంగా నిర్మాణం చేశారని కేంద్ర పర్యావరణ శాఖ తేల్చి పనులు నిలిపివేసింది. పర్యావరణానికి జరిగిన నష్టానికి గాను రూ.53.41 కోట్లు పరిహారం చెల్లించాలని కేంద్ర కమిటీ సిఫార్సు చేసింది. అనుమతి లేని చోట యంత్రాలు పెట్టడం నేరుగా న్యాయస్థానం ఉత్తర్వుల ఉల్లంఘనే అవుతుంది. యాంత్రిక పద్ధతిలో తవ్వకాలు జరపాలంటే గనుల శాఖ నుండి "తవ్వకం ప్రణాళిక" ఆమోదం పొందాలి. ఏ ప్రాంతంలో, ఎంత లోతు, ఎన్ని టన్నులు తీయాలో ముందే నిర్ణయించి ఉత్తర్వులు ఇవ్వాలి. సీతమ్మసాగర్ వద్ద అలాంటి ఉత్తర్వు సంఖ్య ఏదీ ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. లెక్కాపత్రం లేని తవ్వకం అక్రమ తవ్వకం కిందకే వస్తుందని పలువురు మేధావులు ఆరోపిస్తున్నారు. చట్టం ఎవరి చుట్టం? చట్టం ఏం చెబుతోంది. నది నుంచి 1 హెక్టారుకు మించి ఇసుక తవ్వాలంటే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి తప్పనిసరి. ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి. ఇసుక తవ్వకానికి గనుల శాఖ నుంచి 'క్వారీ లీజు' తీసుకోవాలి. ఎంత తవ్వాలి, ఎక్కడ తవ్వాలి, ఎలా తవ్వాలనే నిబంధనలు ఉంటాయి. అటవీ హక్కుల చట్టం – 2006 ఆదివాసీల అనుమతి లేకుండా వారి భూముల్లో, అటవీ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు చేయకూడదు. గ్రామసభ తీర్మానం తప్పనిసరి. సీతమ్మ సాగర్ వద్ద జరుగుతున్న తీరు అది కాదు. "పూడిక తీత"కు పర్యావరణ అనుమతి అవసరం లేదని సాకు చూపి, ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నది గర్భంలో 20 అడుగుల లోతు గుంతలు తీస్తున్నా, 'పర్యావరణ ప్రభావ అంచనా' అధ్యయనం లేదు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నది ప్రవాహ దిశ మారిపోతోంది. స్థానిక గనుల శాఖ ఏడీ కార్యాలయంలో ఈ తవ్వకాలకు సంబంధించిన ఫైలు లేదు. 'ప్రాజెక్టు పనులు' అని చెప్పి, రాయల్టీ ఎగ్గొడుతున్నారు. ఒక్క టన్ను ఇసుకకు రూ.150 రాయల్టీ చొప్పున రోజుకు రూ.18 లక్షలు ప్రభుత్వం నష్టపోతోంది. చట్టం అందరికీ సమానమే. కానీ సీతమ్మ సాగర్ వద్ద మాత్రం చట్టం బినామీల చుట్టంగా మారింది. అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా దోపిడీ జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

### ››› బినామీ కట్టడిదారులు ఆదివాసీలను ఎలా మోసం చేస్తున్నారు...

తమ భూమిని కోల్పోయిన ఆదివాసీలకే, అదే భూమిలో ఇసుక లారీలకు పట్టాలు కట్టే పని చేస్తున్న దుస్థితి. తమ భూమిని తవ్వుకుపోతుంటే కళ్లారా చూస్తూ కూలీలుగా మిగిలి పోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభ లేకుండానే తీర్మానం. అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీ గ్రామాల్లో ఏ పని చేయాలన్నా గ్రామసభ అనుమతి తప్పనిసరి. కానీ బినామీలు కొందరు వార్డు సభ్యులను, పంచాయతీ కార్యదర్శిని లోబర్చుకుని, దొంగ సంతకాలతో తీర్మానం చేసుకున్నారు. మేము గ్రామసభ పెట్టలేదు, మాకు తెలియదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా 'అభివృద్ధి' అనే మాటతో ఆదివాసీల కన్నీళ్లను, భూములను, భవిష్యత్తును బినామీలు దోచుకుంటున్నారు. సీతమ్మ సాగర్ ఆదివాసీల పాలిట శాపంగా మారింది. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ఆదివాసీల బతుకులు మార్చాల్సింది. కానీ బినామీల దాహానికి, అధికారుల అవినీతికి, పాలకుల నిర్లక్ష్యానికి బలైపోతున్నారు. పూడిక తీత ముసుగులో ఇసుక దోపిడీ, పర్యావరణ విధ్వంసం, చట్టాల ఉల్లంఘన, ఆదివాసీల మోసం ఇవన్నీ కలిసి సీతమ్మ సాగర్ ను సాగనంపేలా ఉన్నాయి.



# సేవతో సాగుతున్న ప్రయాణం ...

- సెలవు దొరికితే... సేవలోనే ఎన్. బలరామ్
- మూలాలను మరువని అధికారి
- విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమవుతు పుస్త కాల పంపిణీ
- సోషల్ మీడియాలోనూ సేవా సందేశం







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 27, ప్రజా జ్యోతి :** సివిల్ సర్వీస్ అధికారులు అంటే సాధారణంగా క్షణం తీరిక లేని జీవితం. అందులోనూ ఐఆర్ఎస్ అధికారుల బాధ్యతలు మరింత కీలకం. ఆర్థిక వ్యవహారాలు, పరిపాలనా బాధ్యతలతో నిత్యం బిజీగా ఉంటారు. అలాంటి ఉన్నత హోదాలో ఉన్నవారు ప్రజలకు కొంత దూరంగా ఉండటం సహజం. కానీ మాజీ సింగరేణి సీఎండీ, ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరామ్ మాత్రం ఆ కోవకు భిన్నంగా కనిపిస్తున్నారు. అతను గతంలో సింగరేణిలో పనిచేసిన సమయంలో సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. స్వయంగా ముందుండి సుమారు 20 వేల మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అయితే ప్రస్తుతం ఇతర కీలక బాధ్యతల్లో ఉన్నప్పటికీ ఆయన సేవా కార్యక్రమాలకు ఏమాత్రం విరామం ఇవ్వడం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా విద్య, పర్యావరణం, సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు చేరువవుతున్నారు. ఇటీవల తాను చదువుకున్న మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలంలోని తిరుమలగిరి ప్రాథమిక పాఠశాల, చిన్నరేవల్లి మండల పరిషత్ పాఠశాల, పెద్దరేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించడం అందుకు నిదర్శనం. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయడంతో పాటు తన గురువులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు పెద్ద లక్ష్యాలతో చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. సాధారణంగా ఉన్నత పదవులు చేపట్టిన తర్వాత చాలామంది తమ మూలాలను మరచిపోతారు. కానీ ఎన్. బలరామ్ మాత్రం తన విజయానికి పునాది వేసిన పాఠశాలలను, గురువులను మరువలేదు. తనకు సెలవు దొరికిన ప్రతిసారీ ఏదో ఒక సేవా కార్యక్రమంలో పాల్గొంటూ సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావనతో ముందుకు సాగుతున్నారు. ఆయన చేపడుతున్న కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రజలతో పంచుకుంటూ మంచి సందేశాన్ని అందిస్తున్నారు. పదవి మనిషికి గుర్తింపును ఇవ్వొచ్చు. కానీ సేవా భావం, వినయం, కృతజ్ఞత, సామాజిక బాధ్యత మాత్రమే శాశ్వత గౌరవాన్ని తీసుకొస్తాయి అని నమ్మి.. ఆ విలువలను తన ఆచరణతో నిరూపిస్తూ ఎన్. బలరామ్ తన సేవా ప్రయాణాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు.

- లక్షలు చెల్లించినా పట్టాలు ఎక్కడ..?
- 58, 59 జీ.ఓలపై పెరుగుతున్న అనుమానాలు.
- ఇంటి పట్టా కోసం ఏళ్ల నిరీక్షణ.
- ప్రభుత్వాన్ని నమ్మి లక్షలు కట్టాం.. ఫలితం శూన్యం.
- డిమాండ్ నోటీసులు వచ్చాయి.. పట్టాలు మాత్రం కనపడలేదు.
- పొంతన లేని సమాధానాలు.
- 58, 59 జీ.ఓలపై పేదల ఆవేదన.
- లక్షలు చెల్లించినా అందని పట్టాలు.
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు.



# జీ.ఓ. 58, 59లు.. పేదల ఆశలపై నీళ్లు..!

**పాల్వంచ, జూన్, 27, ప్రజాజ్యోతి:** "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన జీ.ఓ. నెం.58, జీ.ఓ. నెం.59 అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు తీవ్ర నిరాశ, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి స్థలాలకు యాజమాన్య హక్కులు వస్తాయని, రిజిస్ట్రేషన్ పూర్తై పట్టాలు చేతికి అందుతాయని ఆశపడి దరఖాస్తులు చేసుకున్న పేదలు ప్రస్తుతం అధికార కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములపై నిర్మించుకున్న ఇళ్లు, నివాస స్థలాలను క్రమబద్ధీకరించి పేదలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం జీ.ఓ. నెం.58 మరియు జీ.ఓ. నెం.59లను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ రెండు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ భూములపై నివాసం ఉంటున్న అర్హులైన కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడం.

### »» జీ.ఓ.58 – ఉచిత క్రమబద్ధీకరణ

జీ.ఓ.58 ప్రకారం ప్రభుత్వ భూమిపై పేద కుటుంబాలు నిర్మించుకున్న ఇళ్లను కొన్ని అర్హతల ఆధారంగా ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించారు. నిర్ణీత తేదీకి ముందు నుంచి నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ఎటువంటి రుసుము లేకుండా యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఉత్తర్వు జారీ చేశారు.

ఈ ప్రక్రియలో దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి విచారణ, సర్వేలు, అర్హతల పరిశీలన అనంతరం పట్టాలు మంజూరు చేయాల్సి ఉంటుంది.

### »» జీ.ఓ.59 – రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ

జీ.ఓ.59 ప్రకారం ప్రభుత్వ భూములను ఆక్రమించి నివాస గృహాలు నిర్మించుకున్న వారికి నిర్ణీత రుసుము చెల్లించి స్థలాన్ని క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. స్థల విస్తీర్ణం, ప్రాంతం, మార్కెట్ విలువ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం రుసుమును నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన వారికి రెవెన్యూ శాఖ డిమాండ్ నోటీసులు జారీ చేసి, చెల్లించాల్సిన మొత్తాన్ని పేర్కొంది. కొందరికి విడతల వారీగా చెల్లించే వెసులుబాటు కల్పించగా, ఒకేసారి చెల్లింపులకు రాయితీలు కూడా ప్రకటించారు.

### »» దరఖాస్తుల స్వీకరణ – సర్వేలు

జీ.ఓ.58, 59 అమలు సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఇంటింటికీ వెళ్లి స్థలాల పరిశీలన, కొలతలు, అర్హతల ధృవీకరణ వంటి ప్రక్రియలు నిర్వహించారు. దీంతో త్వరలోనే పట్టాలు అందుతాయనే ఆశ ప్రజల్లో ఏర్పడింది.

### »» పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు

అయితే పలు ప్రాంతాల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తయినా తుది నిర్ణయాలు వెలువడకపోవడంతో అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ముఖ్యంగా జీ.ఓ.59 కింద డిమాండ్ నోటీసుల మేరకు డబ్బులు చెల్లించినప్పటికీ పట్టాలు అందలేదని పలువురు ఆరోపిస్తున్నారు

### »» మీసేవ దరఖాస్తుల పేరుతో వేల రూపాయల ఖర్చు

జీ.ఓ.58, 59 కింద దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో వేలాది మంది ప్రజలు మీసేవ కేంద్రాల ద్వారా ధరఖాస్తులు సమర్పించామని, దరఖాస్తులు, ధ్రువపత్రాలు, ఇతర ఖర్చుల పేరుతో ఒక్కో కుటుంబం వేల రూపాయలు వెచ్చించాల్సి వచ్చిందని, ప్రభుత్వం ప్రకటించిన పథకం ద్వారా తమకు శాశ్వత హక్కులు వస్తాయని నమ్మి ప్రజలు ఈ ప్రక్రియలో పాల్గొన్నామని ధరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### »» ఇంటింటికీ వెళ్లి సర్వే చేసిన రెవెన్యూ సిబ్బంది

ధరఖాస్తుల అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బంది హడావుడిగా ఇంటింటికీ వెళ్లి స్థలాల సర్వే నిర్వహించారు. ఆక్రమణలో ఉన్న భూమి విస్తీర్ణం, ఇంటి వివరాలు, అర్హతలు తదితర అంశాలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేశారు. దీంతో ప్రజల్లో తమ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందనే నమ్మకం మరింత పెరిగింది.

### »» 59 జీ.ఓ కింద భారీ డిమాండ్ నోటీసులు

జీ.ఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి రెవెన్యూ శాఖ డిమాండ్ నోటీసులు జారీ చేసింది. భూమి మార్కెట్ విలువ ఆధారంగా వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు చెల్లించాలని సూచించింది. కొందరికి మూడు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించగా, ఒకేసారి మొత్తం చెల్లిస్తే రాయితీ ఉంటుందని డిమాండ్ నోటీసులో పేర్కొన్నారు.

### »» అప్పులు చేసి ప్రభుత్వానికి లక్షలు చెల్లించిన పేదలు

ఇంటి స్థలానికి చట్టబద్ధ హక్కు వస్తుందనే ఆశతో అనేక మంది పేద కుటుంబాలు అప్పులు చేశాయి. కొందరు తమ ఆభరణాలు, పుస్తెలు అమ్మి డబ్బు సమకూర్చుకున్నారు. మరికొందరు వడ్డీకి అప్పు తెచ్చి బ్యాంకు డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో ప్రభుత్వానికి లక్షల రూపాయలు చెల్లించారు. పట్టా చేతికి వస్తే భవిష్యత్తులో తమ పిల్లలకు భద్రత ఉంటుందని భావించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### »» ఏళ్లు గడుస్తున్నా అందని పట్టాలు

డబ్బులు చెల్లించి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇప్పటికీ పట్టాలు అందలేదని బాధితులు చెబుతున్నారు. ధరఖాస్తుల స్థితి ఏమిటి? ఫైళ్లు ఎక్కడ ఉన్నాయి? తదుపరి చర్యలు ఏమిటి? అనే విషయాలపై స్పష్టత లేక ప్రజలు అయోమయంలో ఉన్నారు.

### »» 58 జీ.ఓ అమలు పరిస్థితిపై ప్రశ్నలు

జీ.ఓ.58 కింద అర్హులైన పేదలకు ఉచిత క్రమబద్ధీకరణ జరగాల్సి ఉండగా, అనేక ప్రాంతాల్లో ఫైళ్లు పెండింగ్‌లోనే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తులు స్వీకరించి, సర్వేలు పూర్తి చేసినప్పటికీ తుది నిర్ణయాలు ఆలస్యం కావడం పట్ల లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### »» పై నుంచి ఆదేశాలు రావాలి అంటున్న అధికారులు

తమ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తున్న ప్రజలకు "మా పరిధిలో లేదు", "పై స్థాయి నుంచి ఆదేశాలు రావాలి", "ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం" అనే సమాధానాలే వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. దీంతో ఎవరిని సంప్రదించాలో, తమ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

### »» ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటున్న బాధితులు

జీ.ఓ.58, 59 కింద దరఖాస్తు చేసుకుని డబ్బులు చెల్లించిన వారి సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఉన్న నేపథ్యంలో, పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని బాధితులు కోరుతున్నారు. చెల్లించిన మొత్తాలకు సంబంధించి, పట్టాల జారీ ప్రక్రియపై, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పినట్లు చేశాం, డబ్బులు కూడా చెల్లించాం కానీ, పట్టాలు ఎప్పుడు వస్తాయో చెప్పేవారు లేరు" అంటూ లబ్ధిదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### »» ప్రభుత్వ స్పష్టత కోసం ఎదురుచూపులు

జీ.ఓ.58, 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య, చెల్లింపుల స్థితి, పట్టాల జారీ ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి అర్హులైన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తంగా, పేదలకు భూ హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన జీ.ఓ.58, 59ల అమలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం ప్రస్తుతం వేలాది కుటుంబాల ఆశలు, ఆందోళనలకు కేంద్ర బిందువుగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.